
# చలి



తిరుమలశ్రీ

ప్రొద్దుటే నుంచీ పిచ్చిపిచ్చిగా వుంది నాకు. మనస్సంతా ముసురుపట్టిన ఆకాశంలా అయి పోయింది. రోజంతా అన్యమనస్కంగానే గడిచి పోయింది.

సాయంత్రమయేసరికి జైల్లోనుంచి విడుదలైన ఖైదీల్లా ఆఫీసుల్లోంచి బయటపడ్డ జనంలో నేనూ ఒకడినయ్యాను. ఆలోచిస్తూ నెమ్మదిగా అడుగులు వేస్తున్నాను.

రోడ్డు మీదకొచ్చేసరికి 'జాతీయ పొదుపు సంస్థ' వారి బ్రహ్మాండమైన హోర్డింగ్ వెక్కిరిస్తూ కనిపించింది సెంటర్‌లో 'పొదుపు చేయండి...'

హా!

పొదుపు చేయాలని ఎవరికుండదు? డబ్బంటే చేదా అనవరంగా ఖర్చు చేసేయడానికి?

కాని... ఎక్కణ్ణుంచి తెచ్చి పొదుపు చేయాలన్నదే ప్రశ్న!

ఉన్నవాడికది పిచ్చి ప్రశ్నలా అనిపించవచ్చును. నాలాంటి బడుగువర్గపు ప్రతినిధి మాటేమిటి? రోజుకో పూటయినా సరిగా తినడానికి నోచుకోని నాలాంటివాడు పొదుపు ఎలా చేయగలడు?

హఠాత్తుగా ఉదయపు సంఘటన గుర్తుకొచ్చింది నాకు...

కాసిని టీ నీళ్లు గొంతుకలో పోసుకుని హడావుడిగా ఆఫీసుకు బయలు దేరుతూంటే నా భార్య గొణుగుడు చెవిలో పడింది.-'ఈ మాయదారి చలిని తట్టుకోవడం ఎలాగో తెలియడం లేదు. ఈ చలికాలం గడిచే లోపున చలితో నరాలు బిగిసిపోయి ఒళ్లంతా కొయ్యబారి పోయి

**ఎలాగైనా నా భార్యకు ఓ శాలువా కొనితీరాలని నిశ్చయించుకున్నాను. తెలిసినవాడినల్లా అడిగాను- ఓ వంద అప్పివ్వమని! నా పిచ్చిగాని క్లాస్ ఫోర్‌గాడికి అప్పిచ్చేదెవరు?!**

చచ్చిపోయేలాగున్నాను...'

జాలివేసింది నాకు. నిస్సహాయంగా ఆమె వైపు ఓ చూపు చూడడం మినహా ఏమీ చేయలేని అశక్తత నాది.

మేము ఆ వూరొచ్చి ఏడాదయింది. వేడి ప్రదేశం నుంచి శీతల ప్రాంతానికి వచ్చాము. ఆ వూళ్లో చలి విపరీతంగా వుంటుంది. వచ్చిన కొత్తల్లో ఆ చలికి తట్టుకోవడం దుర్భరమయింది. అక్కడున్న వారంతా ఉన్ని దుస్తులు, శాలువాలు, రగ్గులు వాడతారు; అవేవీ లేవేమో మేము చాలా కష్టపడవలసి వచ్చింది. అలాగని వెంటనే కొనుక్కునే స్తోమత కూడాలేని వాళ్ళం మరి.

ఓ ప్రభుత్వ కార్యాలయంలో క్లాస్‌ఫోర్‌గా పేరుకి నెలకు తొమ్మిది వందల జీతమైనా, కటింగులన్నీ పోను చేతికి చిక్కేది అయిదు వందలు కూడా వుండదు నాకు. వాటితోటే గంపెడు సంసారాన్ని, పుట్టెడు బాధ్యతల్నీ మోయవలసిన వాణ్ణి శాలువలు, ఉన్ని దుస్తులూ ఎలా వస్తాయి?

ప్రభుత్వం ఇచ్చిన ఖాకీదుస్తులతో ఎలాగో నెట్టుకు వచ్చేస్తున్నా నాకు, నా భార్యను చూస్తే విపరీతంగా జాలివేస్తూంటుంది. పేణ్ణీళ్లకు పన్నీళ్ళు అవసరమనుకున్న నా భార్య ఓ ఎలిమెంటరీ స్కూల్లో ఆయాగా చేరింది. నెలకు నూటయాభై రూపాయలు వస్తాయి. సన్నగా, పీలగా వుండే ఆమె చలికి తట్టుకోవడమంటే మాటలు కాదు.

మొదటి సంవత్సరం ఎలాగో గడిపేసాం, మరుసటి సంవత్సరానికి ఓ శాలువానైనా కొనుక్కోలేక పోతామా అన్న ఆశతో. కాని, ఆ ఆశ ఆశగానే మిగిలి పోయింది చలి కాలం తిరిగి వచ్చేసరికి. రోజూ ప్రొద్దుటే చలికి వణికి పోతూ బడికి వెళ్ళే ఆమెను చూస్తుంటే నాకు గుండెలు పిండినట్లనిపిస్తుంది. నా అసమర్ధతకు, అసహాయతకు నా మీద నాకే అక్కసుగా వుంటుంది.

చలి ప్రారంభమై ఇంకా వారం కాలేదు. ముందున్నది ముసళ్ల పండుగ అని, ఆరంభంలోనే అంతలా వొణికించి వేస్తూంటే రాను రాను ఇంకెలావుంటుందో... తలచుకుంటేనే భయంగా వుంటుంది.

ఎలాగైనా నా భార్యకు ఓ శాలువ కొని తీరాలని దృఢ నిశ్చయం చేసుకున్నాను నేను. షాపులో విచారిస్తే ఎంత చవకరకపుదైనా వంద రూపాయలైనా కావాలని తెలిసింది.

ఆ రోజంతా తెలిసిన వాడినల్లా అడిగాను-ఓ వంద రూపాయలు అప్పివ్వమని. నా పిచ్చిగాని క్లాస్ ఫోర్ వాడికి అప్పిచ్చేదెవరు!

శీతాకాలపు రాత్రి చలిలో ముడగదీసుకుని పడుకున్న వూరంతా తిక్కగా తిరిగి పది గంటలకు ఇంటికి చేరాను చేతకాని వాడిలా.

"చలి ఎముకలు కొరికేస్తూంటే ఇంత రాత్రి వరకు బయటెందుకున్నారు?" అని నా భార్య ప్రేమగా మందలిస్తూంటే జవాబివ్వాలని కూడా అనిపించలేదు

